తీయని బాధ

# గడిచిన రోజులు

దండమూడి మహీధర్ కుమార్

గడిచిన రోజులు గుర్తుకొచ్చినప్పుడల్లా నేను నిన్నా, రేపూ లేని తాత్కాలిక వర్తమానంలో లీనమై ఎంతో బాధ పడుతుంటాను. అప్పుడు నా నోటినుంచి వచ్చే మాటలు ఇవి: 'మధు ఎక్కడున్నా సుఖంగా వుండటమే నాక్కావలసింది. అతని సుఖం నాసుఖం. అతని దుఃఖం నాదుఃఖం.' ఈ మాటల్ని నేను నిర్మల నీలాకాశతలాన ప్రకాశించే నక్షత్ర తతికి వినిపించేదాన్ని. ఇంతకంటే నే నెవరికి చెప్పుకుంటాను?

ఈ రోజు - నేను వివాహితను. న్యాయతః నేను నిన్నుగురించి, పరపురుషుణ్ణి గురించి ఆలోచించకూడదు. అలా చేస్తే నేను జీవించలేను. నా బ్రతుకు దుర్భరమవుతుంది. కాని గడిచిన రోజులు గుర్తుకు వచ్చినప్పుడు ఎంతో బాధ పడతాను. నా హృదయాకాశంలో గడిచిన రోజులు సృజించిన వేదన నీలిరంగు మేఘంలా ఆవరించి నీ సంస్మరణ సమీరం తగలటంతో హృదయపు అంచులైన నేత్రాలనుంచి కన్నీటి వర్షం కురుస్తుంది.

పరిస్థితులు విషమించిన కారణాన మనం ర్ణయించుకొన్న ప్రకారంగా నే ను నిన్ను నివివాహం చేసుకోలేకపోయాను. ఇలా కానందుకు నే నెంత బాధపడ్డానో నీకు తెలీదు. కానీ చేసే దేమీ లేదు.

జీవితంలో అన్నీకూడా మన మనుకున్న రీతిగా జరగవు. అలా అనుకోటంకూడా పొరపాటేనేమో?

నీ సంగతులు అప్పుడప్పుడు కిష్టుడు చెబుతూ వుంటాడు. నీవు పరీక్షలో తప్పిపోయాక ఇలు వీడి ఎక్కడికో వెళ్ళిపోయావని తెలుసుకున్నప్పుడు నేను నిజంగా బాధపడ్డాను. నీ జీవితం ఏ మవుతుందోనని నే నెంతో ఇదయాను. నీ వలా వెళ్ళి పోవటంలోని నీ అంతర్యమేమిటో నాకు తెలిసింది కాదు. నీవు తప్పటం-అదే సమయానికి నాకు గోపీతో పెళ్ళి అవటం నీ హృదయాన్ని చాలా బాధపెట్టి వుంటాయి. సహజం.

చాలాసార్లు నీకు ఉత్తరం రాయాలని కాగితం, కలం తీసుకునేదాన్ని. కాని ఎందుకో చెప్పలేని భయం వేసేది. గోపీ నా కళ్ళ యెదుట మెదిలి, 'శశీ! నీవు వివాహితవు; ఇతరులను గురించి ఆలోచించేందుకు నీ హృదయంలో చోటు లేదు. ఇలా చేయటం నీ భర్తకు అన్యాయం చేయటమే!' అని అంటున్నట్లు వుండేది. రాయలేక పోయేదాన్ని. నాలో అశక్తత ప్రవేశించి, నా వివాహబంధనం తాలూకు పవిత్ర ధర్మం విస్మరించేందుకు కావలసిన మత్తును ప్రసాదించి నన్ను వివశురాలిని చేసేది.

నా సుఖానికి ఎప్పుడూ అవాంతరం కలగ లేదు. సమగ్రంగా జీవించేందుకు కావలసిన పరిస్థితులు నాకు గోపీ కల్పించాడు. నేను గోపీని భర్తగా ప్రేమించిన మాట వాస్తవమే. అతని చూపులు నాలో జ్యోతులు వెలిగిస్తాయి.

ఇలాగే రోజులు గడిచాయి. కాలగర్భంలో రెండు సంవత్సరాలు నిహితమై పోయాయి. నాకో పసిపాప జన్మించింది. దాంతో నే రోజులు ఆనందంగా గడుపుకుంటాను. ఇలాంటి సమయంలో కూడా అప్పుడప్పుడు నువ్వు గుర్తుకొచ్చేవాడివి. వెనకటిలాగనే నా పాపాయిని రొమ్ము కదుముకొని నీలనిర్మల ఆకాశానికి నా సందేశాన్ని వినిపించేదాన్ని: 'మధు ఎక్కడున్నా సుఖంగా వుండటమే నా క్కావలసింది. అతని సుఖం నా సుఖం, అతని దుఃఖం నా దుఃఖం.'

గడిచిన రోజుల్ని మరిచిపోటం నిజంగా ఎంత కష్టం! కాని స్త్రీ కొన్ని పరిస్థితుల్లో మరిచిపోవాలి. కాని ఎందుకో నిన్ను మరిచిపోలేకపోయాను. నీవు నెరపిన వర్తన దీనికి కారణమై వుండొచ్చు. అయినా నాకూ, ఇతరులకీ నష్టం లేనంతవరకు నే నిలా నిన్ను గుర్తుంచుకోటంలో తప్పు లేదేమో!

పరీక్షా ఇప్పటికి మూడురోజులక్రితం కిష్టుడు నీ విషయాలు రాశాడు. దాంతో పాటు నీవు రాసిన కథలు కూడా పంపించాడు.

నీవు ఇంతవరకూ అవివాహితుడుగా వుండి ఇంటిదగ్గరే ఖాళీగా వుంటున్నావనీ, పిచ్చివాడులా వుండి ఎంద రెన్ని విధాలుగా చెప్పినా పెళ్ళి చేసుకోటానికి నిరాకరిస్తున్నావనీ తెలుస్తున్నప్పుడు నేను ఎంతో బాధపడ్డాను.

ఇలా భీష్మించుక కూర్చోటానికి కారకురాలను నేను కాకుండా వుండాలని కోరుకుంటున్నా. నాకోసం నీవు ఇప్పుడు ఎంత బాధపడినా లాభం లేదు. నేను వివాహితను. నా చేతుల్లో నా రక్తాన్ని పంచుకున్న మరో ప్రాణి వుంది.

ఇంతవరకూ నేను నా సందేశాన్ని శూన్యానికి వినిపించేదాన్ని. ఈ రోజు ఈ ఉత్తరం ద్వారా వినిపిస్తున్నా: నీవు పెళ్ళి చేసుకొని సుఖంగా వుండు. అదే నే కోరుకునేది. అదే నాకు ఆనందం. అంతా నాకోసం పిచ్చివాడివై పోయావంటారు. ఇలా అంటం నాకు అపచారం కాగలదు. దీన్ని విని గోపీ అపార్థం చేసుకుంటాడు. నా జీవితంలో అంధకారం అలుముకుంటుంది. దాంతో నా బ్రతుకు ఆఖరవుతుంది.

ఇలా కావటం నీ కిష్టమేనా?

తరువాత కిష్టుడు పంపిన నీ కథలు చదివాను. వాటిల్లో నీ మనోవేదన ప్రతిఫలిస్తోంది. నీ పాత్రను నువ్వు ఎంతో దీనంగా సృష్టించుకున్నావు. నే నిక బ్రతకలేనని రాసుకున్నావు. నా జీవితంలో నేను ఒకే ఒకర్ని ప్రేమించగలిగాను, ఇక మరెవర్నీ అసలు ప్రేమించలేనని రాసుకున్నావు.

ఈ ఘట్టాల్ని చదువుకుని నేను చాలా బాధపడ్డాను కాని నీవురాసిన కథల్లో నా పాత్రను సృష్టించి, నన్ను-స్త్రీని- ఒక వివాహిత స్త్రీని. నీ దృష్టి కోణంనుంచి విమర్శించావు. నేను సుఖంగా జీవిస్తున్నానని నీ ఉక్రోషాన్ని వెళ్ళబుచ్చుకున్నావు. నా కీమాటలు గుర్తుకొచ్చాయి.

'The funny thing about being in love is that the moment a man begins to get serious he begins to get foolish'-

ప్రపంచంలో ఏదైనా అర్థం కావాలంటే సానుభూతితో ఆలోచించటం అవసరం. ఆ దృష్టితో చూడకపోతే మనకు అర్థమైన విషయాలుకూడా అర్థంకావు. వైరుధ్యం అనే తెర ఒకటి మధ్య ఏర్పడితే, 'మంచి' అనేది మరుగు పడిపోతుంది.

నావిషయంలో నీ వలాగే చేశా వనిపిస్తోంది- నీ కథలను బట్టి.

నేను నిన్ను మోసంచేశానని- దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఏమీ ఎరగనిదానికి మల్లే వర్తించానని ఏదేదో రాస్తూ నన్ను అపహాస్యం చేశావు.

వీటిని చదువుకొని చాలా వేదనపడ్డాను. నేను అనవరతమూ నీవు సుఖంగా ఆనందంగా వుండాలని కోరుకుంటూ వచ్చాను. ఇప్పుడూ అదే కోరుకుంటున్నా. కాని నీవు నన్ను అపార్థం చేసుకుంటూన్నావు.

కాని గడిచిన రోజుల్ని నెమరుకుతెచ్చుకొని బాధపట్టంవల్ల జరిగే దేమీ లేదు. జరిగిపోయిన దాన్నిగూర్చి విచారించేకంటే జరగవలసినదాన్ని గూర్చి ఆలోచించుకోటం బావుంటుందేమో? ఎంతకాల మిలా తనచేతి కందని వస్తువును గూర్చి ప్రాకులాట్టం? ఇలా చాలామంది చేశారు. అదే నీవూ చేస్తున్నావు. నాదృష్టిలో ఇది తగని పని.

ఇప్పటి కేమీ మించిపోయింది లేదు. వివాహం చేసుకో. అప్పుడే నీకు మనశ్శాంతి లభిస్తుంది. అప్పుడు నన్నుగురించి అలా ఆలోచించలేవు. అప్పుడు నీవు హృదయపూర్వకంగా, సహృదయంతో నన్ను పిలిచావంటే నేను మీ ఇంటికి వస్తాను - నిన్నూ నీభార్యను చూసేందుకు.

అప్పుడు ఇప్పటిలా నామీద కథలు రాయవు. మునిమాణిక్యం నరసింహారావుగారు తన కథల్లో కాంతాన్ని ప్రవేశపెట్టినట్టు, నీవూ నీ 'కాంత'ను ప్రవేశపెడతావు. అప్పుడు నీ కెవరూ గుర్తుండరు. నే నసలే గుర్తుండనేమో...

అప్పుడే గడిచిన రోజులు గతకాలం రెక్కల కింద మరుగుబడి పోతాయి.